AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

8-10-2026 (Thursday)

MAIN EDITION

సీజేపీ ఆందోళన.. బెంగళూరులో టెన్షన్



అక్షరటుడే, కర్ణాటక : బెంగళూరులో హై టెన్షన్ నెలకొంది. సీజేపీ ఆందోళన నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఫ్రీడమ్ పార్కు వేదికగా సీజేపీ నిరసన చేపట్టింది. కర్ణాటకలో ఎస్ఐఆర్‌లో తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. సీజేపీ ఆందోళనకు ధ్రువ్ రాఠే మద్దతు ప్రకటించారు. ఆయనతో పాటు నటుడు ప్రకాశ్‌రాజ్ సైతం ఆందోళనల్లో పాల్గొన్నారు.

అమెజాన్‌లో 1000 ఉద్యోగాల కోత



అక్షరటుడే, బిజినెస్ డెస్క్ : అమెజాన్ మరో 1000 మంది ఉద్యోగులను తొలగించింది. కంపెనీ రిటైల్ వ్యాపారంలోని కొన్ని భాగాలతో సహా, అనేక బృందాలలో సిబ్బందిని తొలగించారు. భారత్, అమెరికా, యూకేలోని ఉద్యోగులపై ఈ కోతలు ప్రభావం చూపుతాయి. ప్రపంచవ్యాప్తంగా 1,000 కంటే తక్కువ వైట్‌కాలర్ ఉద్యోగులు ప్రభావితమైనట్లు సమాచారం. దీనిపై అమెజాన్ స్పందిస్తూ.. కొంతమందిని మాత్రమే తొలగించామని తెలిపింది.

మివీ నుంచి తొలి స్మార్ట్ ఫోన్..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: భారతీయ కన్స్యూమర్ టెక్నాలజీ బ్రాండ్ మివీ.. స్మార్ట్ ఫోన్ రంగంలోకి అడుగుపెట్టింది. బడ్జెట్ ధరలో అధునాతన ఫీచర్లతో మివీ వన్ 5జీ ఫోన్‌ను విడుదల చేసింది. ఆండ్రాయిడ్ 16తో పనిచేసే శక్తిమంతమైన స్నాప్‌డ్రాగన్ 4 జెన్ ప్రాసెసర్, 6000 ఎంఏహెచ్ బ్యాటరీ ఫీచర్లతో వచ్చిన ఈ ఫోన్ ఫ్లిఫ్‌కార్ట్‌లో అందుబాటులో ఉంటుంది.

ఇసుక లారీ బీభత్సం



అక్షరటుడే, ములుగు: ములుగు జిల్లాలో ఇసుక లారీ బీభత్సం సృష్టించింది. అతివేగంగా వచ్చి సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న డీసీఎంను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు చనిపోయారు. అనంతరం లారీ కారును బలంగా ఢీకొట్టింది. ఆ కారులో ప్రయాణిస్తున్న రెవెన్యూ శాఖకు చెందిన ఇద్దరు ఉద్యోగులకి తీవ్ర గాయాలు అయ్యాయి.

పేనీల తయారీ కేంద్రాలపై దాడులు



అక్షరటుడే, హైదరాబాద్ : దీపావళి పండగ నేపథ్యంలో టీజీ సేఫ్ అధికారులు హైదరాబాద్‌లోని గౌలిగూడ, మలక్‌పేట్, జియాగూడ, బడంగ్‌పేట్ ప్రాంతాల్లోని 12 పేనీల తయారీ యూనిట్లపై దాడులు చేశారు. అపరిశుభ్రమైన పరిస్థితుల్లో పేనీలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. పరిశుభ్రత నిబంధనలను ఉల్లంఘించినట్లు పేర్కొన్నారు.

మళ్లీ తెలంగాణకు ఐపీఎస్ అకున్ సభర్వాల్



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : ఐపీఎస్ అధికారి అకున్ సభర్వాల్ తిరిగి తెలంగాణ సర్వీస్‌కు వచ్చారు. ఇన్ని రోజులు డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీస్‌లోకి వెళ్లిన ఆయన తాజాగా సర్వీస్ పూర్తి చేసుకొని తెలంగాణకు వచ్చారు. అకున్ సభర్వాల్ 2001 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. గతంలో తెలంగాణలో ఆయన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఆ సమయంలో టాలీవుడ్ డ్రగ్స్ కేసును ఆయన దర్యాప్తు చేశారు. ఈ కేసులో అనేక మంది టాలీవుడ్ నటులు పేర్లు బయటకు వచ్చాయి. అనంతరం ఈ కేసు పక్కకు వెళ్లిపోయింది. 2023లో అకున్ సభర్వాల్ కేంద్ర హోంశాఖలోకి వెళ్లారు. తాజాగా తిరిగి రావడంతో మళ్లీ డ్రగ్స్ కేసు తెరపైకి వస్తుందా అనే చర్చ మొదలైంది.

దసరా, దీపావళికి ప్రత్యేక రైళ్లు



అక్షరటుడే, సికింద్రాబాద్ : దసరా, దీపావళి పండుగ నేపథ్యంలో ఊళ్లకు వెళ్లే ప్రయాణికులకు రైల్వే శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. చర్లపల్లిశ్రీకాకుళం మధ్య అక్టోబర్ 6, 13, 20, 27 తేదీల్లో ప్రత్యేక రైలు నడపనున్నారు. నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో సైతం స్పెషల్ ట్రైన్ సేవలు అందిస్తోంది. నవంబర్ 25 వరకు విశాఖపట్నంబెంగళూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్, నవంబర్ 30 వరకు నర్సాపూర్‌తిరువణ్ణామలై ఎక్స్‌ప్రెస్ సర్వీసును నడుపుతామని అధికారులు తెలిపారు.



నానా పటేకర్ కన్నుమూత

- బాలీవుడ్ సీనియర్ నటుడు, ప్రముఖ రంగస్థల కళాకారుడు నానా పటేకర్ (75) కన్నుమూశారు.
- గోవాలోని తన నివాసంలో గురువారం తెల్లవారుజామున తీవ్ర గుండెపోటుకు గురైన ఆయనను డోనా పౌలా సమీపంలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు.
- వైద్యులు దాదాపు 45 నిమిషాల పాటు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఉదయం 5.20 గంటలకు ఆయన మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

- అక్షరటుడే, నేషనల్ డెస్క్

■ గుండెపోటుతో మరణించిన బాలీవుడ్ నటుడు ■ సినీ పరిశ్రమకు తీరని లోటు ■ ప్రముఖుల నివాళి

నానా పటేకర్ మరణవార్తతో హిందీ, మరాఠీ చిత్ర పరిశ్రమల్లో విషాదం నెలకొంది. ఆయన కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. నానా పటేకర్ కుమారుడు మల్హార్ పటేకర్ కూడా ఈ విషాద వార్తను ధ్రువీకరించారు. విశ్వనాథ్ పటేకర్‌గా జన్మించిన నానా పటేకర్ ముంబైలోని సర్ జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చదువుకున్నారు. రంగస్థల నటుడిగా కళా ప్రయాణాన్ని ప్రారంభించి, 1978లో వచ్చిన 'గమన్' చిత్రంతో సినిమాల్లోకి ప్రవేశించారు. తొలినాళ్లలో చిన్న పాత్రలు పోషించిన ఆయన.. క్రమంగా తన విలక్షణమైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'సలామ్ బాంబే!', 'పరిందా' వంటి చిత్రాలతో ఆయన నటుడిగా తన స్థాయిని మరింత పెంచుకున్నారు. 'పరిందా'లోని నటనకు జాతీయ చలనచిత్ర అవార్డు అందుకున్నారు.

క్రాంతివీర్' నుంచి 'వెల్‌కమ్' వరకు..

నానా పటేకర్ నట జీవితంలో 'క్రాంతివీర్' కీలక మలుపుగా నిలిచింది. ఆయన చెప్పిన శక్తివంతమైన సంభాషణలు, తెరపై చూపించిన తీవ్రత ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తీవ్రమైన, భావోద్వేగభరితమైన పాత్రలకే పరిమితం కాకుండా హాస్య పాత్రల్లోనూ తన ప్రతిభను చాటుకున్నారు.

దర్శకుడిగానూ

నానా పటేకర్ నటనతో పాటు దర్శకత్వంలోనూ తన ప్రతిభను నిరూపించుకున్నారు. 'ప్రహార్: ది ఫైనల్ అటాక్' చిత్రానికి దర్శకత్వం వహించారు. దాదాపు ఐదు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఆయన మూడు జాతీయ చలనచిత్ర అవార్డులు, ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. భారత ప్రభుత్వం 2013లో ఆయనను పద్మశ్రీతో సత్కరించింది. ఆయన మృతికి ప్రధాని మోదీ సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు.

రేపు ఉంటానో లేదో..


నానా పటేకర్ అక్టోబర్ 4న ఆయన ఓ సమావేశంలో మాట్లాడుతూ.. మరణం గురించి వ్యాఖ్యలు చేశారు. మనందరం ఏదో ఒక రోజు వెళ్లాల్సిందే అన్నారు. "రేపు నేను ఇక్కడ ఉంటానో లేదో నాకు తెలియదు" అని ఆయన అన్నారు. ప్రతి వ్యక్తి జీవితం చివరికి ఆ దశకు చేరుకుంటుందన్నారు. ఈ వ్యాఖ్యలు చేసిన నాలుగు రోజుల తర్వాత ఆయన చనిపోయారు.

పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ అరెస్ట్



అక్షరటుడే, హైదరాబాద్ : టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 'చలో లోక్ భవన్' ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా లోక్ భవన్‌కు బయలుదేరారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి వాకిటి శ్రీహరితో పాటు పలువురు నాయకులను అదుపులోకి తీసుకొని పంజాగుట్ట స్టేషన్‌కు తరలించారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను జేబులో పెట్టుకొని ఎన్నికల వ్యవస్థను మోదీ పాడు చేశారని విమర్శించారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో సరికొత్త 'మ్యూస్' ఏఐ అసిస్టెంట్



అక్షరటుడే, ఫీచర్ డెస్క్ : ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' ఇన్‌స్టాగ్రామ్ వినియోగదారుల కోసం మరో శక్తివంతమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫీచర్‌ను పరిచయం చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌ను మరింత ఆసక్తికరంగా, ఉపయోగకరంగా మార్చే లక్ష్యంతో 'మ్యూస్' పేరుతో సరికొత్త ఏఐ అసిస్టెంట్‌ను అందుబాటులోకి తెచ్చింది. సోషల్ మీడియా వాడకాన్ని కేవలం చాటింగ్‌కే పరిమితం చేయకుండా, మన దైనందిన జీవితంలోని పనులను కూడా ఇది సులభతరం చేయనుంది. ఎక్కడికైనా ట్రిప్ వెళ్లాలనుకుంటే పర్ఫెక్ట్ ట్రావెల్ ప్లానింగ్ రూపొందించడంలో ఇది అద్భుతంగా సహాయపడుతుంది. అలాగే ముఖ్యమైన అపాయింట్‌మెంట్‌లను షెడ్యూల్ చేయడం , ప్రొఫెషనల్ ఈమెయిల్స్ రాయడంలోనూ సహకరిస్తుంది.

భాగ్యనగరవాసులకు నీటి గండం తప్పదా?



అక్షరటుడే, హైదరాబాద్ : వేసవి కాలం ఇంకా రాకముందే భాగ్యనగర వాసులకు తాగునీటి తిప్పలు మొదలయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో గతంలో సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో.. హైదరాబాద్ నగరానికి ప్రధాన తాగునీటి వనరులుగా ఉన్న ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు ఆందోళనకర స్థాయిలో పడిపోతున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే.. రాబోయే డిసెంబర్ నాటికి నగరానికి నీటిని అందించే జలాశయాలు పూర్తిగా ఖాళీ అయిపోయే ముప్పు ఉందంటూ అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారత్‌లో 'స్టార్‌లింక్' సేవలపై ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు

అక్షరటుడే, నేషనల్ డెస్క్ : ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సంచలన ఆరోపణలు చేశారు. భారత్‌లోని కొందరు కుబేరులు తన స్టార్‌లింక్ సేవలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవడానికి స్టార్‌లింక్ సేవలు భారత్‌లో ప్రవేశ పెట్టకుండా ఆపుతున్నారని పేర్కొన్నారు. దేశంలోని 11,256 గ్రామాల్లో ఇంకా 4జీ నెట్‌వర్క్ లేదన్నారు. అయితే కొందరు మాత్రం తమ కంపెనీ భారత్‌లోకి రాకుండా చేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. వారు ఎవరో మీరు ఊహించగలరు... ఇది భారత ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరం అని ఆయన అన్నారు. ఆయన ఆరోపణలను భారత్ ఖండించింది. నిబంధనల ప్రకారం అనుమతులు జారీ చేస్తామని స్పష్టం చేసింది.

బియ్యం ధరలకు రెక్కలు..



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరలు ఒక్కసారిగా కొండెక్కి కూర్చొన్నాయి. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జేబులకు చిల్లులు పడుతున్నాయి. నిన్న మొన్నటి వరకు కిలో 45 నుండి 50 రూపాయల మధ్య లభించిన సాధారణ రకం బియ్యం ధరలు.. ఇప్పుడు ఏకంగా 80 నుండి 90 రూపాయలకు దూసుకెళ్లాయి. గత ఏడాదితో పోలిస్తే కిలో బియ్యంపై రూ. 30 వరకు భారం పెరిగింది. రాబోయే రోజుల్లో మార్కెట్‌లో బియ్యం ధరలు సెంచరీ దాటి కిలో వంద రూపాయలకు చేరుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదని మార్కెట్ విశ్లేషకులు, వ్యాపారులు హెచ్చరిస్తున్నారు.

వైద్య రంగంలో వ్యాపార ప్రకటనలకు చెక్

అక్షరటుడే, ఢిల్లీ : వైద్య రంగాన్ని పట్టిపీడిస్తున్న వ్యాపారాత్మక ధోరణులకు, ఆసుపత్రుల పేరిట జరిగే దగాకోరు ప్రచారాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ మెడికల్ కమిషన్ కీలకమైన నిర్ణయం తీసుకుంది. అమాయక రోగులను ఆకర్షించడమే లక్ష్యంగా కొందరు వైద్యులు, ప్రైవేటు ఆసుపత్రులు చేస్తున్న అసత్యపు ప్రకటనలపై ఎన్ఎంసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. సరికొత్త కఠిన మార్గదర్శకాలను జారీ చేసింది. ఆరోగ్య సంరక్షణ అనేది లాభార్జన వ్యాపారం కాదని, అది ఒక పవిత్రమైన సేవ అని స్పష్టం చేస్తూ ఈ నూతన నిబంధనలను అమల్లోకి తెచ్చింది.